# నందనవనం - 17

‘‘నువ్వెన్ని చచ్చు పుచ్చు మాటలు చెప్పినా ప్రయోజనం లేదు. నిన్ను పచ్చడి పచ్చడి చేసేయడం ఖాయం..!’’ అన్న వాడి భుజం మీద చేయి వేసి అనునయంగా ఆయన ‘తమ్ముడూ..’ అంటూ ఏదో చెప్పబోయాడు.

‘‘ఆ వరస వద్దన్నామా... అర్థంకాదా... మళ్ళీ అదే పిలుపా..?’’ విసురుగా ఆయన చేతిని తీసేసి కసురుకుంటున్నట్లే అన్నాడు.

‘‘మరి.... నేనూ చెబుతున్నాగా, మన అందరికీ బంధుత్వం ఉందనీ...!’’

‘‘అదేమిటో అర్థం అయి చావట్లా...’’ అంటూ ఆయనవైపు ఇంకొకడు వింతగా చూశాడు.

మరొకడూ వింతగా చూస్తూ అడిగాడు. ‘‘మాకు నువ్వు అమ్మవైపు చుట్టానివీ, అబ్బవైపు వాడివీ కాదుగా...?’’

‘‘అదే నేను.. చెప్పబోతున్నానయ్యా.... నా సిద్ధాంతం ఏమిటంటే... ఏదోరకంగా ఏదో విధమైన బంధుత్వం మనందరిమధ్యా ఉంటుందన్నది నిజం..! వెనక్కి... అలా ఇంకా ఇంకా వెనక్కి, మూలాలకూ వెళ్ళితే... ఈ సృష్టికి ఆరంభంలో ఇద్దరు మనుష్యులు.... తల్లీ, తండ్రీ... అంతే... ! అంతా అలా వాళ్ళనుండి వచ్చినవాళ్ళమే కదా... మధ్యలో ఎన్నో జాతులు, రీతులు ఏర్పడితేనేం... ఆలోచిస్తే.... అందరం ఒకటేననే విషయం బోధపడటం లేదూ...?’’

‘‘ఇలా మాటలతో కనికట్టు చేద్దామనుకుంటే.... మా దగ్గర చెల్లుబాటు కాదు లేవయ్యా..!’’వాళ్ళల్లో ఒకడన్న మాటలకు ఆయన చిరునవ్వుతోనే చూశాడు.

‘‘కనికట్టు చేయాల్సిన అవసరం లేనేలేదు ... మీరెలాంటివాళ్ళో కళ్ళకు కట్టినట్టుగా మీ మాటలు, మొహాలు చెప్పకనే చెబుతున్నాయి గదా..!’’.

ఆయన మాటలు అర్థంకానట్లు మళ్ళీ ఓసారి అందరూ మొహా మొహాలు చూసుకున్నారు.

‘‘ఏంటి... మా మొహాలు మా గురించి చెబుతున్నాయా.... అదేమిటో...?’’

ఆ ప్రశ్న దూసుకు వచ్చిన వైపుకు చూసి ఆయన ‘‘అదే చెబుతాను. తమ్ముడూ...’’ అన్నాడు చిరునవ్వుతో.

ఈసారి ఎవరూ ఆయన పిలుపుకు అభ్యంతరం చెప్పలేదు. ఆ విషయం గమనించిన ఆయనకు కించిత్తు ఆనందం కలిగింది. ఉత్సాహంగా చెప్పుకు పోయాడు.

‘‘ మీ అందరిలో నాకు నిజాయితీయే కనిపించింది. తీసుకున్న డబ్బులకు పని చేయాలనే తపన నిజంగా గొప్పది! అలిసి పోకుండా ఎక్కడో విశ్రాంతిగా కూర్చుని.... చేసేసామని చెప్పాలనే ధోరణి లేకుండా.... అవతలివాడి బలాబలాలు లెక్క వేసుకోకుండా, తగువుకు సిద్ధపడి వచ్చిన మీ ధైర్యమూ మెచ్చుకోతగిందే...!

నిష్కారణంగా కొట్టమని యజమాని చెప్పాడా... లేక నిజంగా శిక్షించతగ్గ తప్పు అవతలివాడు చేసాడా... అనే ఆలోచన లేకుండా యజమాని పట్ల గౌరవం, విశ్వాసం చూపించటమూ ఎన్నదగిన సుగుణమేగా!

కేవలం మంచిపనే చేయాలనే నియమం పెట్టుకోకుండా... డబ్బు తీసుకుని ఎవరిపైన అయినా దాడి చేయటానికి తెగించి.... ఆ పనిలోని కష్టనిష్ఠురాలను భరించటం వెనుక మీ కుటుంబాలను పోషించాలనే బాధ్యతే కదూ మీకు ఉన్నదీ....? ఎవరైనా ఎవరి బాధ్యతను వాళ్ళు సక్రమంగా నిర్వర్తించాల్సిందే కదూ....?

మీరేం చేసినా.... ఆ పనిలోని తప్పు ఒప్పులన్నీ మీవికావు... కేవలం మీరు నిమిత్త మాత్రులే! అందుకే... కొట్టాలని వచ్చామని మీరు చెప్పినా నాకు కోపం కలగటంలేదు! పైగా ప్రేమే కలుగుతోంది....! అందుకే వరస కలిపాను.... ఆపైన మీ పనికి నేనూ సహకరిస్తానే తప్ప.... మీకెలాంటి హానీ తలపెట్టను...!''

''ఏమిటో.. ఏమీ బోధ పడకుండా ఇదంతా ఏమిటయ్యా....మాకు... సహకరిస్తావా... అంటే ఏమిటీ..?.. నువ్వూ డబ్బులిస్తానంటున్నావా...? అందుకని కొట్టకుండా వదిలేయలా..?'' నీరసంగా మొహం పెట్టి వాపోయాడొకడు.

''సహకరించటమంటే.... ఎదురుదెబ్బ తీయటానికి ప్రయత్నించనని అర్థం. నా శరీరం మీ కప్పగించేస్తాను ... మీ కసితీరేలా చితక్కొట్టుకోండి... సరేనా..?''

ఆయన మాటలకు వాళ్ళు వ్యంగ్యంగా నవ్వారు. ''నువ్వేమైనా గాంధీ ననుకుంటున్నావా?'' అనే ప్రశ్న ఒకటి వచ్చింది వాళ్ళ వైపు నుండి.

''గాంధీ అంతటి గొప్ప వాడినని అనుకోవటం లేదు. కానీ ఆయన సిద్ధాంతాల పట్ల నమ్మకాన్ని పెంచుకున్న వాడిని! గాంధీ పుట్టిన దేశానికీ, అరుగులబడి నడిపి మనుష్యుల్లో మార్పుకు తన జీవితాన్ని అంకితం చేసిన మా తాతకూ వారసుడిగా ఈ గ్రామానికి చెందినవాడిననే ఆనందం నాకు ఉంది! గాంధీగారు విజయం సాధించి తన

సిద్ధాంత బలమెంతటిదో నిరూపించారు కదా, నేనూ అలాగే ప్రేమ మంత్రంతో మనుష్యుల మనసుల్ని గెలవగలనని నమ్ముతూంటాను! తప్పంటారా....?''

''అదంతా మాకు తెల్వదుగానీ... నువ్వీ ఊరుకు ఎందుకు వచ్చినట్లూ..? ఏం దోచుకు పోవాలని వచ్చావో అది చెప్పు. ఊరు విషయాల్లో వేలు పెట్టకుండా.... మూటా ముల్లు సర్దుకుని వచ్చిన దారిని పోతే ఏ గొడవా ఉండదు!'' ఒకడి దూకుడు మాటలకు వత్తాసుగా మరొకడు ఇంకో మాట అన్నాడు ''అవును, కోట్లాటకు సహకరిస్తానన్న వాడివి... మేం చెప్పిన ఈ పని ఎందుకు చేయకూడదయ్యా..?''

ఆయన ఒక క్షణం విస్మయంగా చూసి ఆలోచించినట్లు మౌనంగా ఉండి తర్వాత అన్నాడు.

''మీరన్నట్లుగా.... అలా చేసినా అది మీకు సాయంగా ఉంటుందనుకుంటే... అదీ చేస్తాను. కాకపోతే నేనిక్కడనుండి వెళ్ళిపోవటం వలన తగువులనేవి తగ్గుతాయా.....? నావల్లే అవి వస్తున్నాయా..? అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకుంటున్నానా...! ఈ ప్రశ్నలకు జవాబు తెలుసుకోకుండా వెళ్ళిపోతే... అసంతృప్తిగా ఉంటుంది కదా...! అందుకే మీరు జవాబు చెబితే... ఆనందంగా వెళ్ళి పోతాను....! మీరంతా నా ఊరివాళ్ళు... నా కుటుంబమే అన్న భావన నాకుంది...! అందుకే అడుగుతున్నా... చెప్పండి.

నా మాటా ఇంకొకటి కొంచెం వినండి. నేనేం ఈ ఊరిలోని సంపదని దోచేసుకుని దాచుకుందామనుకునీ ఇక్కడకు రాలేదు. ఈ ఊరి ప్రజలు కులాల వారీగా ఎక్కువ తక్కువలని గొడవలు పడటం బాధ పెట్టింది! విద్య వలన వివేకం కలుగుతుందీ, ఆ తేడాలూ సమసిపోతాయని మా తాతగారు ఆశించి విద్యాలయాలు స్థాపించారట.

అయితే.. విచిత్రంగా విద్యావంతులైన వాళ్ళల్లోనే ఈ తేడా పెరిగి... వెర్రి తలలు వేసిందనే విషయం తెలిసి... ఎక్కువ తక్కువ కులాలవాళ్ళంటూ మనుష్యుల మధ్య, ఇళ్ళ మధ్యా విభజన, సరిహద్దు రేఖలూ ఉండకుండా చెరిపేయాలనే ఉద్దేశ్యంతో మాత్రమే ఇక్కడకు వచ్చాను.

ఏం, మీ అందరికీ మనం ఒకటిగా ఉండటం నచ్చదా....? ఊళ్ళో వాళ్ళందరికీ మీరు కావల్సిన పనులు చేసిపెడుతూన్నారేగానీ... కష్టపడకుండా కాలు మీద కాలు వేసుకుని కూర్చోవటం లేదుగా ? ఎవరికి తగ్గ పని వాళ్ళు చేయాల్సిందే! అందరూ అన్ని రకాల పనులూ చేస్తేనేకదా... మన జీవితం సజావుగా గడుస్తుందీ..? మరి.. ఎక్కువ తక్కువలు ఎందుకూ.... పనిని బట్టి గౌరవ మర్యాదలు దక్కటం వరకూ ఫరవాలేదు గానీ ఎవరి పనినీ తక్కువ చేసి చూడకూడదుకదా... కొన్ని పనులు చేసేవాళ్ళని చులకన చేసి దూరం పెట్టడం భావ్యమేనా..? అంతెందుకూ ఎవరో పెద్దలు డబ్బు ఇచ్చినంత మాత్రాన... ఎవరినైనా కొట్టటానికీ, ఆఖరుకు చంపటానికీ మీరు ప్రాణాలకు తెగించాల్సిన అవసరం ఏమిటీ? ఇది ఖచ్చితంగా కొందరు మనుష్యుల్ని అవమానించటమే! మీరు కష్టపడి సక్రమంగా పని చేసి సంపాదించలేని వాళ్ళనేమో... వాళ్ళ డబ్బుతో మిమ్మల్ని కొనేసి.. మీతో ఎంత నికృష్టమైన పని అయినా చేయించగలమనే ధీమా కొందరు పెద్దలకు ఎందుకు వస్తోంది..?

మీకు హాని తల పెట్టిన వాళ్ళని మీ కండబలం చూపించి ఎదుర్కోవాలి గానీ, ఎవరో చెబితే, డబ్బుకోసం.... ఎందుకూ అని అడగకుండా.. ఎలాంటి పనికయినా సిద్ధపడాల్సిన అవసరం ఎందుకు వచ్చిందీ..? మీ శక్తి సామర్థ్యాలను సరిగా ఉపయోగించుకుని... మీరూ మంచి స్థాయికి ఎదగాలని కోరుకోవాలిగానీ.. కర్కశంగా ఇంకొకరిని బాధించే పనులు ఎందుకు చేయాలనే ఆలోచనే మీకు కలగదా ... ?

కనీసం ... నన్ను కొట్టటానికి బయలుదేరే ముందు .. నేను చేసిన తప్పును తెలుసుకోవాలనీ అనిపించలేదా..? పోనీ తెలిసి ఉంటే... అది చెప్పి.... మీ పని మీరు చేయండి....!''

ఆయన మాటలకు వాళ్ళు - నివ్వెరపోయినట్లు కళ్ళప్పగించి చూశారో క్షణం.

''ఏటో.... ఏమీ బోదపడటం లేదు... మాటల్తో మాయ చేస్తున్నాడనిపిస్తోంది... ఎందుకొచ్చిన గొడవ ఇదంతా.... పోదాం పదండి.... ఏం చేయాలో తోచలేదని చెప్పి తప్పుకుంటే సరిపోద్ది!'' ఒకడు గొణిగినట్లుగా అన్నాడు గానీ గట్టిగానే ఉంది స్వరం.

మిగతా వాళ్ళూ అవునన్నట్లు తలలూపారు.

''మళ్ళొస్తాం..... అప్పుడు అంతు చూస్తాం....!'' బీరాలు పలుకుతున్నట్లు బింకంగా చూసి....మెల్లగా జారుకున్నారు.

అక్కడ అలాగే రెండు క్షణాలు నిలబడి పోయిన ఆయన పెదవులపై చిరునవ్వు వెలిసింది!

రెండడుగులు వేసిన వాడొకడు చప్పున వెనక్కొచ్చి.... ''ఏవో మెత్తని మాటలు చెప్పి మమ్మల్ని తిప్పి పంపగలుగుతున్నానని మురిసిపోకు....! మా మోటు జనం ఘాటు దెబ్బల్ని తట్టుకోలేవని దయ తలచి వదిలేసాం ఈ పాలికి'' దురుసుగా హెచ్చరించినట్లుగా అన్నాడు.

''మళ్ళీవస్తామని రెండు క్షణాల క్రితమేగా చెప్పారూ. ఇదేనా మళ్ళొస్తామన్నదీ...? ఇంత వెంటనే అనుకోలేదు... అనవసరంగా ఎవరి మీదా దౌర్జన్యం చేయకూడదనేగా చెప్పానూ... అంతమాత్రానికే కోపం ఎందుకు తమ్ముడూ... మన

పెద్దవాళ్ళు చెప్పనే చెప్పారా 'సామ దాన దండోపాయలంటూ' ఒక వరస ఏర్పరిచారు... అందుకే ఎవరితోనైనా మనం ముందుగానే కయ్యానికి కలబడిపోకూడదు. మెల్లగా మంచి మాటలతోనే హితవు చెప్పాలి..... వినకపోతే... మిగతావాటి ప్రయోగం మొదలు పెట్టాలి... అవును కదూ....?'' అనునయంగా అంటున్నట్లే.... ఒక భుజంపై చేయి వేసి, మరొక చేత్తో అతని అరచేయిని పట్టుకున్నాడు.

ఆయన పిడికిలి కొంచెంగా బిగుసుకుంది. అతను ''ఇదేమిటీ....'' అంటూ విలవిల లాడిపోతూ ''నా చేయి వదలండీ.... నిజంగానే, మీ అబ్బాయిగారు చెప్పినట్లు కీళ్ళన్నీ పట్టుతప్పి... కళ్ళకి చుక్కలు కనబడు తున్నాయి....! బలం చాలక అనుకున్నాగానీ మీరే దయ తలచారని  ఇపుడు అర్థమైంది....!'' మొర పెట్టు కుంటున్నట్లు కీచు గొంతుతో అరిచాడు.

''చుక్కల లోకం చూసొచ్చానని చక్కగా నీ దోస్తులతో చెప్పుకో పో....''అంటూ ఆయన పిడికిలి సడిలించేసరికి అతను పరుగు పెట్టేసాడు! వాళ్ళతో ఏం చెప్పాడోగానీ, వాళ్ళూ వెనుదిరిగి, ఆయనవైపు భయంగా చూసి నడకవేగం హఠాత్తుగా పెంచేశారు.

ఆయన పెదవులు మళ్ళీ చిరునవ్వుతో విచ్చుకున్నాయి!

ఆయన లోపలకు వెళ్ళగానే రామం దగ్గర్నుండి ఫోను వచ్చింది. ''ఇక్కడకు వచ్చినాగానీ ఇంటిదగ్గర ఏం జరుగుతోందా అని ఒకటే ఆరాటంగా ఉంది!'' అని ''నన్ను అక్కడ ఉండనివ్వకుండా తరిమేశారుగా...'' అంటూ కినుకా చూపించాడు.

''ఉండి.... ఏం తమాషా చూడాలనుకున్నావ్ రా..? ఏం జరిగి ఉంటుందనుకుంటున్నావో..... ఇప్పుడు చెప్పు....!''

ఆయన మాటలకి రామం ఫోనులోనే పెద్దగా నవ్వాడు. ''మీ మాటల్లో ఎటువంటి ఆదుర్దా లేదు కాబట్టి.. వాళ్ళంతా క్షేమంగానే వెళ్ళిపోయారన్న మాట! మీ మాటల మంత్రం బాగానే పనిచేసిందని అర్థమైంది....!''

''నువ్వీ విషయం మాత్రం బాగానే ఊహించావులే....'' అంటూ ఆయన మాటలు ముగించి ఫోను పెట్టేశాడు.

పక్కనే ఉన్న శ్రీవల్లి ఆయన వైపు చిరునవ్వుతో చూసింది. ''నేను ఏం జరుగుతోందో తెలుసుకోవటానికి గుమ్మం దగ్గర్నుండి అప్పుడప్పుడూ అంతా చూస్తూనే ఉన్నానా... మీరన్నట్లు మాటల మంత్రం కంటే..... మీ పిడికిలి తంత్రమే ఎక్కువ పని చేసిందని నాకు అర్థమైన విషయం...! అవునా...?.'' అంటూ మళ్ళీ చిన్నగా నవ్వింది.

ఆయనా అవునన్నట్లు తలవూపి ''కొందరి జబ్బుకి.... మాటలే... అదేలే... మాత్రలే సరిపోతాయి..! మరి కొందరికి గట్టిగా చురుక్కుమనిపించే సూది వైద్యమే తగినది....!'' అంటూ చిన్నగా నిట్టూర్చాడు.

అక్కడితో ఆ సంభాషణ ముగిసింది.

* * *

ఒక రోజు..

శ్రీవల్లి పెట్టిన కేకకి అదిరిపడి పరుగున ఆ గదిలోకి అడుగు పెట్టిన ఆయన.. అక్కడ ఓ పుస్తకం చేత బట్టుకుని నిలబడిన ఆవిడను చూసి స్థిమితపడ్డాడు. ''ఏమిటంతలా కేక పెట్టావ్...? ఎంత కంగారు పడ్డానో...!'' అనడిగాడు అదిరిపడిన గుండెను చేత్తో రుద్దుకుంటూ.

‘‘అవును.... ఇదేంటీ.... ఇన్నాళ్ళూ... కాదుకాదు... ఇన్నేళ్ళూ ఈ విషయం చెప్పనేలేదూ...! ఆ సుబ్బూ... ఈ సుబ్బూ.... ఒకరేనా... నేనస్సలు గుర్తుపట్టలేదు...! మరి... మీరైనా ఎప్పుడూ నాకు చెప్పనే లేదేం....?’’

‘‘నేను మాత్రం నిన్ను చూసి - గుర్తు పట్టే... పలుకరిద్దామని దగ్గరకు వచ్చాను. నువ్వు నన్ను చూసి ఎక్కడో చూసినట్లుగా ఉందని అంటే... చెప్పేవాడిని! కానీ, నువ్వసలు గుర్తే పట్టనపుడు... నేనూ ఎప్పటివో ఆ స్కూలు రోజులను జ్ఞాపకం చేయటం ఎందుకులే అని వూరుకున్నాను. అందమైన అమ్మాయిని అబ్బాయిలందరూ పదే పదే తలుచుకుంటూ... ఆతర్వాతా గుర్తించుకుంటారు. అమ్మాయిలకు అలాంటి ఆరాధకులు ఎందరో

ఉంటారు కాబట్టి... వాళ్ళెవరూ జ్ఞాపకంలో ఉండరనే నిజాన్ని గ్రహించాను. నీ ప్రవర్తనతో...! అందుకే...’’ అంటూన్న ఆయనవైపు శ్రీవల్లి చురుగ్గా చూసింది. తర్వాత చిన్నగా నవ్వింది.

‘చాలా సంవత్సరాల తర్వాత చూసినా... ఆయన తనను గుర్తుపట్టానని చెబుతున్నాడు. మరి- తనేమో గర్తుపట్టలేదు సరికదా... కనీసం ఎక్కడో చూసిన జ్ఞాపకమైనా లేదు కాబట్టి... ఆ మాటల్ని ఒప్పుకుని తీరాల్సిందే’ ననుకుంది.

ఆరోజులు మళ్ళీ కళ్ళ ముందు కదలాడాయి.

అది.... వాళ్ళ హైస్కూలు చదువులో ఆఖరి సంవత్సరం, స్కూలు మ్యాగజైన్‌లో తమ క్లాసబ్బాయే రాసిన గేయం ప్రచురింపబడిరదంటూ తన స్నేహితురాళ్ళు కొందరు చూపించి... ‘నీమీదే రాసాడు చూశావా... ఎంత ధైర్యమో... గట్టిగా ‘ఇదేంటని’ నిలదీసి అడుగూ!’ అంటూ ఎగదోసారు.

తను పూర్తిగా చదివింది. ఆ కవిత ఇలా సాగింది.

'సోయగాల సిరిమల్లీ.... కలలరాణి కల్పవల్లీ...

గగనాన తిరుగాడే జాబిల్లీ.... పుడమి వైపు ఓపరి పరికించి చూడవా...

పరవశాన పదిమందీ మెచ్చే పాట పాడవా...'

ముందు ఆ మూడు లైన్లూ చదివి చివరకు దృష్టి సారించింది.

'దోసిట విరిసిన మల్లెలతో నీ ముందు మోకరిల్లిన

నీ హితవుకోరే స్నేహితుడు...'

అని ఉంది. ఆ తర్వాత నిదానంగా మధ్య పంక్తుల్నీ చదివింది.

కుల మతాల ప్రాధాన్యం లేని సమాజంలో మానవత్వమే అందరి సిద్ధాంతంగా నిలవాలనే కోరిక, ప్రభోధం ఆ వచనా కవితలో వెల్లడైంది!

తనకి బాగా నచ్చింది.

ఏదో ఆలోచనతో నిలబడి పోయిన తనకు ధైర్యం నూరిపోస్తున్నట్లుగా మళ్ళీ స్నేహితులు హెచ్చరించారు.... 'ఇందులో ఏమాత్రం సందేహం లేదు... నీ గురించే అలా రాసేసాడు... మనం బుద్ధి చెప్పకపోతే... ఇంకా రెచ్చిపోతాడు...! అదిగో అక్కడ ఎవరో ఒకడిని... పక్కన పెట్టుకుని చెట్టుక్రింద కూర్చున్నాడు... అందరం వెళ్ళి చెడామడా చీల్చి చెండాడితే... చెంపలు వేసుకుంటాడు....!'

'వాళ్ళు.... ఇద్దరేగా ఉన్నారు.. మనం మాత్రం ఇంతమందిమి వెళ్ళట. ఎందుకూ.. మనమూ ఇద్దరమే వెళ్తే సరీ...' అంటూ పక్కనున్న ఓ అమ్మాయి చేయి పట్టుకుని లాక్కెళ్ళింది! తమ రాకకు ఆశ్చర్యపోయి తత్తరపడుతూ లేచి నిలబడిన వాళ్ళ వైపు ఓసారి చూసి... 'మీ కవితను ఇప్పుడే చదివాను... నాకు బాగా నచ్చింది! మీరు కృషి చేస్తే.. గొప్ప కవి కాగలరు..' అంటూ అభినందించి... అక్కడ ఒక క్షణం కూడా నిలబడకుండా చకచకా వెనక్కి వచ్చేసింది.

ఎదురు చూస్తున్న స్నేహ బృందానికి తనతో వచ్చిన అమ్మాయి జరిగిన సంగతి వివరించగానే.... వాళ్ళంతా 'ఎందుకిలా చేశా'వంటూ తనమీద విరుచుకు పడ్డారు !

'నిజంగానే నాకు బాగా నచ్చింది! మీరేమో మొదటి రెండు లైన్లూ చదివి.. నా గురించే రాసాడని తీర్మానించేశారు! 'వల్లీ' కి 'మల్లీ' కి తేడా లేదా ? ఒకవేళ 'వల్లీ' అని రాసినా అభ్యంతరం చెప్పాల్సిందీ ఏం లేదు.. అసభ్యంగా రాస్తే, నేనే చెంపలు వాయించేదాన్ని ! అ తరువాత ఏం జరిగినా ఫరవాలేదు, ఎదుర్కోగలననే ధైర్యం కూడా ఉంది! అలాగే మంచి కనిపించినప్పుడూ మనం ప్రోత్సాహించాలి గానీ ... అపార్ధం చేసుకుని అభ్యంతరాలు చెప్పకూడదు... ! అదేమీ శృంగారం ఒలికించిన గేయం కాదు.. 'నాతో కలిసి సమసమాజ నిర్మాణానికి అడుగులు వేస్తావా ? ' అని ఒక స్నేహితురాలిని అడుగుతున్నట్లుగా సమాజ హితం కోరే అభ్యుదయ గేయంలా సాగింది !' అంటూ తన మనసులోని మాటను వాళ్ళకు నిర్భయంగా చెప్పింది.

వాళ్ళంతా 'అబ్బో....' అంటూ కనుబొమలెగురవేసి.... ''నీకు ఇష్టంగా ఉన్నపుడు మధ్యలో మాకేంటీ...'' అని వెక్కిరించారు కూడా! ఆ తర్వాత ఎప్పుడైనా అతన్ని కలిసినా, మాట్లాడినా పరిహాసాలతో తన పని పడదామని ఎదురు చూసి

ఉంటారు. కానీ అలాంటి దృశ్యాలేవీ వాళ్ళ కంట పడకపోయే సరికి, చేసేదేం లేక వాళ్ళూ మిన్నకుండిపోయారు!

అతనిలోని సామర్థ్యాన్ని అభినందించాలని మాత్రమే అనుకోవటం వలనే తర్వాతెపుడూ అతనిని కలవాలనీ, మాట్లాడాలనీ తను అనుకోలేదు. తన చదువు ధ్యాస తనది!

శ్రీవల్లి ఆలోచనల నుండి బయటకు వచ్చి... చెప్పింది. ''ఆ తర్వాత సంవత్సరమే మా నాన్నగారికి ట్రాన్సఫరు అవటంతో మేం ఆ ఊరు మారిపోయాం. అపుడొక నిముషం మాత్రమే ఏదో చూసీ చూడనట్లుగా చూసి ఆ రెండు మాటలూ చెప్పానంతే కదా, అందుకే .... అన్ని సంవత్సరాల తర్వాత చూసినపుడు మీరు... గుర్తుకు రాలేదు ! అయితే.. అప్పుడు మీరు రాసిన కవితలోని మొదటి రెండు లైన్లూ యథాతథంగా మాత్రం గుర్తుండి పోయాయి! అవే మాటలు మనసులో కొన్నాళ్ళు మార్మోగుతూండేవి కూడా! తర్వాత తర్వాత పూర్తిగా చదువు గొడవలో పడి మరిచిపోయాను గానీ!

ఇదిగో... ఇప్పుడు.. ఇన్నాళ్ళకి నా కళ్ళబడిన ఈ నోట్ బుక్‌లోని ఈ కవితలోని మొదటి వాక్యాలు చదవగానే... ఇదంతా జ్ఞాపకం వచ్చి.. అపుడు నేను సరిగా చూడని అబ్బాయి మీరేనని అర్థమై.. ఆశ్చర్యంతో అప్రయత్నంగా కేక పెట్టేసానన్న మాట!''

శ్రీవల్లి ఆయనవైపు చిరునవ్వుతో చూసింది. ''అవునూ... ఇన్నేళ్ళల్లో ఎప్పుడూ ఈ ప్రస్తావన మనమధ్య రాకుండా ఎందుకంత గోప్యంగా ఉంచాలనుకున్నారూ..? అసలు ఈ నోట్ బుక్ నాకు కనిపించకుండా అంత రహస్యంగా ఎలా దాచగలిగారు..?'' మళ్ళీ ప్రశ్నలు గుప్పించింది!